వీధి వ్యాపారులకు మళ్లీ రుణాలు!

- ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కేంద్రం ప్రోత్సాహం
- అందించేందుకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కసరత్తు
- 10 మందితో కామన్ ఇంట్రస్ట్ గ్రూపులుగా ఏర్పాటు
- 16 మందితో ప్రత్యేక కమిటీ
- ప్రతినెల మొదటి వారంలో సమావేశం


వీధి వ్యాపారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలాల (ఫైల్)


వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు(ఫైల్)

చాదర్‌ఘాట్: వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం రుణాలు అందిస్తూ బాసటగా నిలుస్తోంది. ఇప్పటికే కొందరికీ లోన్లు అందించగా, సక్రమంగా చెల్లించిన వారితో పాటు కొత్తవారికి కూడా మళ్లీ రుణాలు అందించేలా జీహెచ్‌ఎంసీ కసరత్తు ప్రారంభించింది. గతంలో మొదటి విడతలో ఒక్కో వ్యాపారికి రూ. 10 వేల రుణం అందించారు. సక్రమంగా చెల్లించిన వారికి రెండో విడతలో మళ్లీ రూ. 20 వేలు..మూడో విడతలో రూ. 50 వేలను అందించారు. అయితే గతంలో మాదిరిగానే మళ్లీ వీధి వ్యాపారులకు మరిన్ని రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో సక్రమంగా రుణాలు చెల్లించిన వారి జాబితా రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 పరిధిలో టౌన్ వెండింగ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో 10 మంది వీధి వ్యాపారులతో కామన్ ఇంట్రస్ట్ గ్రూపులుగా ఏర్పాటు చేసి స్వయం సహాయక సంఘాల తరహాలోనే ఈ గ్రూప్‌నకు రుణాలు ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 పరిధి కిందికి వచ్చే మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, చావుని, సైదాబాద్, అక్బర్‌బాగ్ డివిజన్ల పరిధిలోని 2,252 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో సగానికి పైగా మంది తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించారు. ఇప్పుడు వారందరికీ మళ్లీ రుణాలు ఇచ్చే ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నది.


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీ జయంత్

టౌన్ వెండింగ్ కమిటీ..

టౌన్ వెండింగ్ కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌తో పాటు స్థానిక తహసీల్దార్, ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, స్వయం సహాయక బృందాల సభ్యులు కలిసి మొత్తం 16 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి నెల మొదటి మంగళవారం ఈ కమిటీ సమావేశం అవుతుంది. వీధి వ్యాపారుల సాధకబాధకాలపై చర్చించి వారి సమస్యలు తెలుసుకోవడమే కాకుండా పరిష్కారానికి కృషి చేయనున్నది.

స్థానికంగా ఉండి అభివృద్ధికి కృషి చేస్తా


వెంకటరమణ కాలనీలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోనే నివాసముంటూ అభివృద్ధికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. చంపాపేట డివిజన్ ఉదయనగర్ కాలనీలో వరద నీటి నాలా పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం వనస్థలిపురం డివిజన్ మల్లికార్జుననగర్‌లో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాలనీవాసుల కోరిక మేరకు పార్కు అభివృద్ధి, సీసీ రోడ్లు, కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం క్రిస్టియన్‌కాలనీలో నాలా పనులు, వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీ శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. నూతన భవనం నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం శ్రీ వెంకటరమణ కాలనీ సమావేశంలో మాట్లాడుతూ..నియోజకవర్గంలో ఎమ్మెల్యే, అధికారులు అవినీతిపరులకు కొమ్ము కాస్తు అక్రమ నిర్మాణాలను ప్రోత్సాహిస్తున్నారని ఆరోపించారు. 2 రోజుల క్రితం సెల్లార్ గోడ కూలి ముగ్గురు మరణించడమే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. బాధితుల కుటుంబాలకు బాధ్యుల నుంచి రూ. 53 లక్షల ఆర్థిక సహాయం అందేలా చేశామని తెలిపారు. కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, నాయకులు కట్ల నర్సింహాయాదవ్, మకుటం సదాశివుడు, శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, పాశం అశోక్‌గౌడ్, బుడ్డా సత్యనారాయణ, నాయకులు సామ మహేశ్వర్‌రెడ్డి, జిట్టా సురేందర్‌రెడ్డి, నవీన్‌కుమార్, వెంకటేశ్, విష్ణు మూర్తి, శశి, కిరణ్, కవిత, భాను పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


కల్యాణోత్సవంలో చైర్మన్ పూర్ణచందర్‌రావు దంపతులు, పురోహితులు, సభ్యులు

మలక్‌పేట: మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ శ్రీకంచికామకోటి పీఠం కంచిపురం, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం 26వ బ్రహ్మోత్సవాలు, శివపార్వతీ అమ్మవార్ల 17వ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పలు పూజలు, శ్రీవారి కల్యాణం, శివపార్వతి అమ్మవార్ల శాంతి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. కమిటీ చైర్మన్ ఉన్నవ పూర్ణచందర్‌రావు శారద దంపతులు, వైస్ చైర్మన్ విశ్వేశ్వర్‌రావు, సెక్రటరీ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ బాలకృష్ణ, కోశాధికారి రంగాచార్యులు, అడ్వయిజర్లు సత్యనారాయణ, ఏఆర్ చౌదరి, ట్రస్టీలు, మేనేజర్లు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు జ్వాల నర్సింహాచార్యులు, టీటీడీ వేదపండితుల పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్లు పూర్ణచందర్‌రావు తెలిపారు.

మల్లేశ్వర స్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

సైదాబాద్: మాతామైదాన్‌లోని శ్రీ విజయదుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు మహోత్సవాలు కొనసాగుతాయన్నారు. మొదటి రోజు ఒగ్గు కళాకారుల బృందంతో గంగ, పుట్ట పూజలు, అనంతరం గంగతెప్ప కార్యక్రమం ఉంటుందన్నారు. 12న తెల్లవారుఝామున చండీహోమం, ఉదయం 11:15 గంటలకు శ్రీవిజయదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణం, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ అనంతరం సద్దర్ పట్టం కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేరోజు సాయంత్రం శ్రీవిజయదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఊరేగింపు చేపడుతామని పేర్కొన్నారు. 13న సాయంత్రం అమ్మవారికి బోనాల సమర్పణతో వేడుకలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.


విద్యుత్ దీపాల అలంకరణలో విజయదుర్గామాతా ఆలయం

వివేకానంద చౌరస్తాలో రక్తదాన శిబిరం


నరేశ్‌యాదవ్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు దీనబంధు సేవాసదన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్ జన్మదినం సందర్భంగా హస్తినాపురం సెంట్రల్ వివేకానంద చౌరస్తా వద్ద శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరై మాట్లాడారు. రక్తదానంతో ప్రాణం పోసినవారవుతారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అరుణాసింగ్, చిట్టిపోలు రవికుమార్, శ్రీష, రాజేశ్‌బాబు, చిన్నాయాదవ్, భార్గవ్, రాఘవేంద్ర యాదవ్, జీవన్‌రెడ్డి, కోట్లశివ, మల్లేశ్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, సంకల్ప, సురేశ్, రాజు, సుధాకర్‌రెడ్డి, సతీశ్‌కుమార్, సాయియాదవ్, కృష్ణారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌ల్లో కూరగాయల ధరల వివరాలు. టమాటా రూ.11, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 28, కాకరకాయ 35, బీరకాయ 40, కాలిఫ్లవర్ 18, క్యాబేజీ 09, క్యారెట్ 17, దొండ 28, ఆలుగడ్డ 25, ఉల్లిగడ్డ 34, గోకరకాయ 35, దోసకాయ 23, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, చిక్కుడుకాయ 35, చామగడ్డ 40, మునగ 70, చిలుకడదుంప 65, బీట్‌రూట్ 17, కీర 23, బీన్స్ 35, క్యాప్సికమ్ రూ. 35. ఈధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

గ్యాస్ లీకై మంటలు

చైతన్యపురి: ఓ దుకాణంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. చంద్రకళ అనే మహిళ శారదానగర్‌లోని ఓ షటర్‌లో శ్రీసాయిచంద్రకళ పిండివంటల దుకాణం నిర్వహిస్తుంది. మూడు రోజులుగా షాపు బంద్ చేసి ఉన్నది. శుక్రవారం సాయంత్రం చంద్రకళ షటర్ ఓపెన్ చేసి లైట్ స్విచ్ ఆన్‌చేయగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, స్థానికులు ఆమెను బయటకు తీసుకువచ్చి కాపాడారు. చీరకు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. చంద్రకళకు ఎలాంటి గాయాలు కాలేదు. గ్యాస్ లీకేజీ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని వారు భావిస్తున్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి


రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీలోని రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని డివిజన్ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు చౌకి రవికుమార్, యాదగిరి, రామకృష్ణ శుక్రవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా పనులు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక కార్పొరేటర్ షఫీఉద్దీన్ వెంటనే స్పందించి పనులు మొదలయ్యేలా కాంట్రాక్టర్‌కు సూచించాలని వారు కోరారు.

నాలా పనులు ప్రారంభించాలని వినతి


జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: నాలా పనులను వెంటనే ప్రారంభించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ కోరారు. ఈమేరకు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ఏపీఎస్‌ఈబీ కాలనీ నుంచి బైరామల్‌గూడ చెరువు వరకు ఎస్ఎన్‌డీపీ నిధులు 12.30 కోట్లు మంజూరయ్యాయన్నారు. వర్షాకాలం రాకముందే పనులు చేపట్టి పూర్తిచేస్తే ఎన్నోకాలనీలకు వరద ముప్పు తొలగుతుందన్నారు. జోనల్ కమిషనర్ కూడా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చినట్లు ఆమె తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

వనస్థలిపురం: ఎన్జీవోస్ కాలనీలోని కాపు సంఘం భవనంలో వనస్థలిపురం కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. వైద్యులు కంటి, దంత, బీపీ, షుగర్ పరీక్షలు చేసి కంటి ఆపరేషన్లకు సంబంధించి పలు సూచనలు, సలహాలు చేశారు. అలాగే ఉచితంగా మందులు, అద్దాలు అందించారు. శనివారం కూడా శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణుడు డా. బొగ్గు సురేశ్, కాపు సంఘం అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి పున్నయ్య, కోశాధికారి రత్నారావు, స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షుడు కే.సంజయ్‌కుమార్, హనుమంతరావు, సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, నరసింహ, ప్రసాద్, శ్రీనివాసరావు, ఆంజనేయులు, సత్తిబాబు పాల్గొన్నారు.



అనుమానం పెనుభూతమై..

భార్యను గోడకేసి కొట్టిన భర్త


చికిత్స పొందుతున్న సునీత

చైతన్యపురి: అనుమానం పెనుభూతమై భార్యపై హత్యాయత్నం చేసిన ఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ తాటికోలుకు చెందిన పబ్బ వెంకటేశ్ (36), సునీత (33)లకు 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఆర్కేపురంలో నివసిస్తున్నారు. వెంకటేశ్ ఆటోడ్రైవర్‌గా చేస్తుండగా సునీత ఇండ్లలో పనులు చేస్తుంది. అయితే వసంత ఇతరులతో వివాహేతర సంబంధం పెట్టుకుందని అనుమానం వ్యక్తం చేస్తూ పలుమార్లు భార్యతో గొడవపడ్డాడు. ఎంత చెప్పినా భార్య వినడం లేదని శుక్రవారం ఉదయం గొడవ పడి ఆమె తలను గోడకేసి కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడింది. చనిపోయిందని భయపడిన వెంకటేశ్ ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చైతన్యపురి స్టేషన్ పరిధి కావడంతో వారికి సమాచారం ఇచ్చారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకేశ్వరరావు సునీతను చికిత్స కోసం ఓమ్ని ఆసుపత్రిలో చేర్పించి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సైదాబాద్: హోటల్ రూంలో పేకాడుతున్న ఆరుగురిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంపాపేట కృష్ణానగర్‌కు చెందిన నీలా లోకేష్ (31) చంపాపేట ప్రధాన రహదారిపై ఉన్న డీ ఆల్ఫాబెట్ హోటల్‌లో రూంను అద్దెకు తీసుకుని జూదగాళ్లను పిలిచి పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సైదాబాద్ పోలీసులు గురువారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేసి నిర్వాహకుడు నీలా లోకేశ్, పేకాడుతున్న కొత్తకోట సాయిరాం, మన్నాడి సాయిరాజా, గాడి నరేశ్, గజేంద్ర, పసులాడి రాఘవేందర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 24,100 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి

నాగోలు: ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయణగుట్టలోని బండ్లగూడ హఫీజ్ బాబానగర్‌కు చెందిన ఎండీ మోసిన్‌ఖాన్ (50) ఎల్‌బీనగర్‌లోని ఆటోనగర్‌లో గాజుల దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి ద్విచక్ర వాహనం పై ఇంటికి వెళ్తుండగా సాగర్ రింగ్ రోడ్ ఫ్లైఓవర్ వద్ద కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు రక్తస్రావం కావడంతో స్థానికులు ఎల్‌బీనగర్‌లోని మెడిసిటీ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై హర్షం

నాగోలు: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర గౌవర అధ్యక్షుడు రుద్రాల స్వామి మాదిగ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణలో భాగంగా మాదిగ ఉపకులాలకు 9 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్లుగా పోరాడుతున్న మాదిగల పోరాటానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పుకు అనుకూలంగా ముందుకు సాగడం శుభపరిణామమని పేర్కొన్నారు.

ఆస్తుల విక్రయంతోనే మదర్ డెయిరీ మనుగడ

- చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి
- పాలకవర్గం సమావేశంలో తీర్మానం
- మెజార్టీ చైర్మన్ల ఆమోదం
- భిన్నవాదనలు వినిపించిన పలువురు రైతు సంఘాల చైర్మన్లు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

హయత్‌నగర్: నష్టాల్లో కూరుకుపోతున్న డెయిరీని రక్షించుకోవాలంటే ఆస్తులు విక్రయించి బకాయిలను తీర్చడం తప్ప వేరే మార్గం లేదని, ఇందుకు రైతు సంఘాల చైర్మన్లు ఆమోదం తెలపాలని నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (నార్మల్ మదర్ డెయిరీ) చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి కోరారు. హయత్‌నగర్ మదర్ డెయిరీ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఆయన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతకాలంగా అప్పల భారం పెరిగి నెలకు సుమారు రూ. 40 లక్షలు వడ్డీలకే చెల్లిస్తున్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే డెయిరీ మనుగడే కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాలను తగ్గించేందుకు రోజుకు 50-60 వేల లీటర్ల పాల అమ్మకాన్ని 80 వేల లీటర్ల వరకు పెంచామని అయినా వడ్డీల భారం పెరుగుతుండడంతో ఆస్తులు అమ్మాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. డెయిరీ మనుగడ రైతుల చేతుల్లోనే ఉందని పాలకవర్గ ప్రతిపాదనకు చైర్మన్లు సానుకూలంగా ఉండాలని ఆయన కోరారు. చైర్మన్ ప్రతిపాదనను ఆమోదిస్తూ మెజారిటీ చైర్మన్లు సంతకాలు చేశారని అధికారులు తెలిపారు.

పలువురు చైర్మన్ల భిన్న వాదనలు..

డెయిరీ ఆస్తుల అమ్మకం ప్రతిపాదనపై పలు రైతు సంఘాల చైర్మన్లు భిన్న వాదనలు వినిపించారు. నష్టాలకు కారణమైన అధికారులు, గత పాలకవర్గ సభ్యులపై చర్యలు తీసుకోవాలని, భూములు విక్రయించకుండా ప్రభుత్వం నుంచి గ్రాంటు తీసుకురావాలని, వ్యయాలను తగ్గించాలని, సేల్స్‌ను పెంచేందుకు ఉద్యోగులను మరింతంగా వినియోగించాలని సూచించారు. ఆస్తులు అమ్మితే ముందుగా రైతుల బకాయిలు చెల్లించాలని, మిగిలిన వాటిని రైతులకు బోనస్‌గా ఇచ్చి, అవసరమైతే మరోచోట ఆస్తులను కొనాలని కోరారు. రైతుల బకాయిలు చెల్లించిన తర్వాతే అప్పులు చెల్లిస్తామని, ఆస్తుల అమ్మకం ఓపెన్ యాక్షన్ ద్వారా అంతా పారదర్శకంగా చేస్తామని చైర్మన్ మధుసూదన్‌రెడ్డి హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎండీ కృష్ణ, మాజీ చైర్మన్లు గుత్తా జితేందర్‌రెడ్డి, గంగుల కృష్ణారెడ్డి, శ్రీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హాజరైన రైతు సంఘాల చైర్మన్లు

యూనానీలో దీర్ఘకాలిక వ్యాధులకు మెరుగైన సేవలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ మండలకేంద్రంలోని యూనానీ ప్రభుత్వాస్పత్రిలో అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వైద్యుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కామెర్లు, పక్షవాతం, కీళ్లవాతం, ఎముకల వ్యాధులు, కిడ్నీలో రాళ్ల తొలగింపు, శరీరంపై తెల్లమచ్చలు, చర్మ వ్యాధులకు ఎలాంటి ఆపరేషన్లు, సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మందులతో చికిత్స అందుబాటులో ఉందని పేర్కొన్నారు. బాధితులు ఎవరైనా ఉంటే యునానీ ఆస్పత్రిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోపు సంప్రదించాలని ఆయన సూచించారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


సమావేశంలో ఎమ్మెల్యే బలాల, అధికారులు

మలక్‌పేట: పంజేషాహ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల జీహెచ్‌ఎంసీ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రంజాన్ పండుగ నేపథ్యంలో అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, కొత్తవాటికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఈఈ పీర్‌సింగ్, ఏఈలు వెంకన్న, శరత్‌రెడ్డి, మల్లికార్జున్, సైట్ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్


కారు బ్లాక్ ఫిల్మ్‌లు తొలగిస్తున్న డీసీపీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

మలక్‌పేట: సిటీ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు దిల్‌సుఖ్‌నగర్, నల్లగొండ క్రాస్‌రోడ్, మలక్‌పేట ప్రాంతాల్లో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు హాజరై కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌లు తొలగించారు. డ్రైవ్‌లో మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై రాము, యాదయ్య, వినోద్, ఘని, రామస్వామి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గణితం పోటీల్లో భాష్యం విద్యార్థుల ప్రతిభ



వనస్థలిపురం: రామానుజన్ గణిత పోటీ పరీక్షల్లో వనస్థలిపురానికి చెందిన భాష్యం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లాస్థాయిలో మూడో తరగతి విద్యార్థి వి.గౌరవ్ మొదటిస్థానం, ఐదో తరగతి విద్యార్థిని అంజలి సహస్ర ద్వితీయ స్థానం అలాగే పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. దీంతో శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల జెడ్ఈఓ అంకమ్మరావు అభినందించారు. కార్యక్రమంలో భాష్యం లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ హేమంతలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉజ్జయిని మహంకాళి విగ్రహ పునఃప్రతిష్ఠ



చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ దోభీగల్లీలోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హోమాలు, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుదర్శన్, బాబు శ్రీనివాస్, ఆగమయ్య చౌదరి, చౌకి రవికుమార్, రాజు, శంకర్ ముదిరాజ్, నర్సింగ్ పాల్గొన్నారు.